# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**తేది: జనవరి 20, 2019**

# సైకిల్ యాత్రతో శాంతి అసాధ్యం!

## మధ్య భారతంలో నిజమైన శాంతి కోసం కార్పొరేట్లు పాల్పడుతున్న వనరుల దోపిడీని ఆపివేయాలనీ, క్యాంపులను ఎత్తివేయాలనీ, అర్ధ సైనిక బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేయాలి!

రాబోయే ఫిబ్రవరి 22 నుండి 28 వరకూ తలపెట్టదలచిన జగదల్‌పూర్-రాయ్‌పూర్ 'శాంతి సైకిల్ యాత్ర' నిర్వాహకుడూ, దేశీయ, విదేశీయ కార్పొరేట్ సంస్థల విశ్వసనీయ బంటు/ఏజెంటు శుభ్రాంశు చౌదరి అసలు రంగును గుర్తించాలనీ, ఆ యాత్రను బహిష్కరించాలనీ, దానికి దూరంగా వుండాలనీ ఛత్తీస్‌గఢ్‌తో పాటు యావత్ దేశ ఆదివాసీ, దళిత, మత మైనారిటీ, ఇతర వెనుకబడిన తరగతుల ప్రజలకూ, ప్రజాస్వామిక-ప్రగతిశీల మేధావులకూ, ప్రజాపక్ష మీడియా వర్గాలకూ, ఆదివాసీ, ఆదివాసేతర సామాజిక సంఘాలకూ, మానవ హక్కుల, మహిళా సంఘాలకూ, విద్యార్థీ, యువజనులకూ, నిజమైన శాంతిని కాంక్షించే వారందరికీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తున్నది. దానితో పాటే మధ్య భారతంలో నిజమైన శాంతిని నెలకొల్పడానికి, దేశ వనరులను కార్పొరేట్లు దోచుకోవడానికి చేసుకున్న ఎంఓయూలన్నింటినీ రద్దు చేయాలనీ, పోరాట ప్రాంతాల్లో క్యాంపులను ఎత్తివేయాలనీ, పోలీసు, అర్ధ సైనిక, కమాండో బలగాలను ఉపసంహరించాలనీ, డీఆర్‌జీ, బస్తర్ బెటాలియన్, బ్లాక్ పాంథర్స్ తదితర హంతక కమాండో బలగాలను రద్దు చేయాలని ప్రభుత్వాలను పెద్ద ఎత్తున డిమాండ్ చేయమని మా పార్టీ పిలుపునిస్తున్నది.

మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించి ప్రజలందరికీ చెందిన సంపదనూ, వనరులనూ దేశ, విదేశ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి చేసుకున్న మొత్తం ఎంఓయూల అమలును వీలయినంత త్వరగా సునిశ్చితం చేసుకోవడం కోసమే 2017 మే నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా బహు ముఖ 'సమాధాన్' నిర్బంధ యోజన అమలవుతున్నదనేది తెలిసినదే. ఇందులో భాగంగానే కార్పెట్ సెక్యూరిటీ విస్తరిస్తూ నిరంతరం కొత్త క్యాంపులు వెలుస్తున్నాయి. పెద్ద ఎత్తున పోలీసు, అర్ధ సైనిక బలగాల మోహరింపు జరుగుతున్నది. గ్రామాలపై దాడులు ఉధృతమవుతున్నాయి.

శుభ్రాంశు నాయకత్వంలో తలపెట్టిన శాంతి సైకిల్ యాత్ర నిజానికి ఈ 'సమాధాన్'లో భాగమైన కుటిల, కుట్రపూరిత అంశమేనన్న విషయం ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. ఘోరమైన సమాధాన్ నిర్బంధంపై ముసుగు వేసే ప్రయత్నంలో భాగమిది. గనుల తవ్వకాలూ, పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వాలతో ఎంఓయూలు చేసుకున్న కార్పొరేట్ కంపెనీల ద్వారా, వాళ్ల ప్రయోజనాల కోసం తలపెట్టిన కార్యక్రమమిది. సామ్రాజ్యవాద ప్రయోజనాలను పోషించే మేధో సమూహం (థింక్ టాంక్), ఎంఐటీ (మెసాచ్యూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) వంటి కార్పొరేట్ ఉన్నత సమాచార సంస్థల నుండి పుట్టిన సీజీ నెట్, స్వరా మొదలైన కార్యక్రమాలను శుభ్రాంశు నిర్వహిస్తూ చర్చ పేరుతో ఆదివాసీ ప్రజలు, మేధావులు, సామాజిక సంస్థల కార్యకర్తలను నిర్వాసిత వ్యతిరేక ఉద్యమం, విప్లవోద్యమం నుండి దూరం చేయడానికి లేదా దారితప్పించడానికి పథకం ప్రకారం పని చేస్తున్నాడు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గడిచిన పదిహేనేళ్లలో భాజపా ప్రభుత్వం అమలు చేసిన ప్రజా వ్యతిరేక, నిర్బంధ విధానాలను ఒక మేరకు వ్యతిరేకిస్తూ, ఆ విధానాలకు వ్యతిరేకంగా నెలకొన్న వాతావరణాన్ని ఉపయోగించుకొని 2019 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భాజపా దారిలోనే నడుస్తూ కొత్త క్యాంపులను వేస్తున్నది. ఇటీవలనే కాంకేర్ జిల్లా, కోయిలాబేడ బ్లాక్, దుట్ట గ్రామంలో ఒకటీ, ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర సరిహద్దులోని పానావారలో మరొకటీ కొత్త క్యాంపులను వేశారు. ఎన్నికల ముందు కొనసాగుతూ వుండిన ఫాసిస్టు అణచివేత, ఎన్నికల సమయంలోనూ, నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనూ నిరాటంకంగా కొనసాగుతున్నది. గస్తీ అభియాన్లు, గ్రామాలపై దాడులు, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు అడ్డూ అదుపూ లేకుండా జరుగుతున్నాయి. మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆపరేషన్లు యథాతథంగా కొనసాగుతాయని కాంగ్రెస్‌కు చెందిన కొత్త ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించింది. బస్తర్‌లో మోహరించిన అర్ధ సైనిక బలగాలకు చెందిన 70 బెటాలియన్ల బలగాలను ఉపసంహరించేది లేదని కొత్త ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ స్పష్టంగా చెప్పాడు.

ఇటువంటి పరిస్థితుల్లో శాంతి సైకిల్ యాత్ర నిర్వాహకులు – వీరిలో సీపీఐ ప్రజా సంఘమయిన ఆదివాసీ మహాసభ కూడా భాగస్వామిగా వుంది – అన్ని పక్షాలూ హింసను వీడి చర్చల ద్వారా పరిష్కారం కనుక్కోవాలని విజ్ఞప్తి చేయడమంటే ప్రభుత్వమూ, మా పార్టీని ఒకే గాటన కట్టడం. ఇది హాస్యాస్పదమైనదే కాదు, ఏహ్యమైనది కూడా. వాస్తవమేమంటే ప్రభుత్వాలే స్వయంగా అశాంతినీ, హింసనూ వ్యాపింపచేస్తున్నాయి. హింస లేకుండా దోపిడీ పాలకులకు ఒక్క రోజు కూడా గడవదు. సాయుధ బలగాల శక్తిపై ఆధారపడే తమ అధికారాన్నీ, దోపిడీని కొనసాగిస్తాయి. పోయిన సంవత్సరం జరిగిన శాంతి యాత్ర, డైలాగ్-1 కావొచ్చు లేదా ఈ ఫిబ్రవరిలో తలపెట్టిన శాంతి సైకిల్ యాత్ర,

డైలాగ్–2 కావొచ్చు, ఇక్కడ అసలు సమస్య శాంతి, అహింసలకు సంబంధించినది కాదు. వర్గ ప్రయోజనాలకు సంబంధించినది. ఒకవైపు ప్రభుత్వాలు దేశ, విదేశ కార్పొరేట్ కంపెనీలకు సాయుధ శక్తి దన్నుపై, హింసను ప్రయోగిస్తూ ప్రజల సంపదను, భూమి, నీళ్లు, ఖనిజ వనరులను చౌక ధరకు కట్టబెట్ట చూస్తున్నాయి. మరోవైపు మావోయిస్టు పార్టీ అనివార్యమైన ప్రతిహింస ద్వారా ఈ వనరులపై ప్రజల అధికారాన్ని సునిశ్చితం చేయాలనుకుంటున్నది. శుభ్రాంశు వంటి శాంతి యాత్ర నిర్వాహకులు ప్రభుత్వ హింస, మావోయిస్టుల ప్రతిహింసను ఒకేగాటన కడుతూ శాంతి పేరుతో ఆఖరికి ప్రజలకు తమ సైన్యం, సాయుధ బలం లేకుండా చేసి, వారిని కార్పొరేట్ దోపిడీకి బలి చేయాలనుకుంటున్నారు. ఇదీ అసలు విషయం. ఈ శాంతి సైకిల్ యాత్ర కోసం చేసిన విజ్ఞప్తిలో ప్రచురించబడిన ఆదివాసీ, సామాజిక సంఘాలు – ఛత్తీస్‌గఢ్ సర్వ్ ఆదివాసీ సమాజ్, అఖిల భారతీయ గోండ్వానా గోండ్ మహాసభ, కోయ కుటుం, ధుర్వ సమాజ్, బస్తరియా సమాజ్, భతరా సమాజ్, గోండ్వానా రాజ్ గోండ్ సమితి, శబరి గాంధీ ఆశ్రం– సహా తెలిసీ, తెలియకా శాంతి సైకిల్ యాత్రలో భాగం కాబోతున్న ఆదివాసులూ, శాంతి కాముకులందరికీ మా విజ్ఞప్తి ఏంటంటే 'మీరంతా శాంతి సైకిల్ యాత్ర నిజస్వరూపాన్ని అర్థం చేసుకొని సరైన రాజకీయ దశా దిశలను అవలంబిస్తూ వనరుల దోపిడీకీ, దాని కోసం జరుగుతున్న ప్రభుత్వ హింస – సమాధాన్ దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి. అంతే గానీ మావోయిస్టులతో శాంతికి విజ్ఞప్తి చేయడం తగదు.' ఎందుకంటే మా పార్టీ పీడిత ప్రజల నిజమైన శాంతి కోసం పోరాడుతున్నది.

మా పార్టీ ప్రజల నీళ్లు, అడవి, భూములు, వనరులనూ రక్షించే యుద్ధాన్ని చేస్తున్నదని ఇక్కడ చెప్పుకోవడం సముచితంగా వుంటుంది. ప్రజల నిజమైన అభివృద్ధి, దారుణమైన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది. వాళ్లపై కొనసాగుతున్న హింసను ఆపడానికి అనివార్యంగా ప్రతిహింసకు పూనుకున్నది. నిజానికి మా పార్టీ పీడిత, తాడిత ప్రజల ప్రజాస్వామ్య రాజ్యాధికారం కోసం పోరాడుతున్నది. దండకారణ్యంలో ఉదయించిన ప్రజా రాజ్యాధికార అంగాలు – విప్లవ ప్రజా కమిటీలను దోపిడీ పాలక వర్గాలు నాశనం చేయపూనుకున్నాయి. వీటిని నిలుపుకోవడానికీ, రక్షించుకోవడానికీ, బలోపేతం చేసుకోవడానికీ, విస్తరింపచేసుకోవడానికి మా పార్టీ ప్రజల చురుకైన భాగస్వామ్యంతో ప్రజా యుద్ధాన్ని కొనసాగిస్తున్నది.

అయినప్పటికీ మా పార్టీ ప్రతిసారీ చెప్పుకుంటూ వస్తున్నది ఏంటంటే అనుకూల వాతావరణంలో ప్రజల, ప్రజా పోరాటాల ప్రయోజనాల కోసం ప్రజల మౌలిక సమస్యలన్నింటిపై పాలక వర్గాలతో మా పార్టీ చర్చలకు సిద్ధంగా వుంటుంది. కానీ ఏదైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పని నడవగలిగేలా నేటి పరిస్థితి లేదు.

వనరుల దోపిడీకి సంబంధించిన ఎంఓయూలను రద్దు చేయడం, సాయుధ బలగాలను ఉపసంహరించుకోవడం వంటి వాస్తవ, మౌలిక విషయాలపై శాంతి సైకిల్ యాత్రా నిర్వాహకులు మౌనం వహించారు. ఇవే కాక పలు డిమాండ్లను పేలవంగా ముందుకు తెస్తున్నారు. ఎందుకంటే వాళ్ల ఉద్దేశ్యం ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కాదు, మావోయిస్టులకు వ్యతిరేకంగా వాతావరణాన్ని తయారు చేయడం మాత్రమే.

జైళ్లల్లో మా కార్యకర్తలూ, నాయకులే కాకుండా వేలాది ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు ఏళ్ల తరబడి మగ్గుతున్నారు. వాళ్ల కోసం పని చేసే 'జగ్‌లగ్' (జగదల్‌పూర్ లీగల్ ఎయిడ్ గ్రూప్)కు చెందిన న్యాయవాదులను మునుపటి భాజపా ప్రభుత్వం కనుసన్నల్లో 'అగ్ని'కి చెందిన గూండాలు బస్తర్ నుండి వెళ్లగొట్టారు. 2012లో ఏర్పడ్డ నిర్మల బుచ్ సమితి ఆరేళ్లు వ్యర్థంగా కాలం గడిపేశాక జైళ్లలో మగ్గుతున్న ఆదివాసుల విడుదల పేరుతో ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ మరొక కమిటీని ఏర్పాటుచేశాడు. ఇప్పుడు కమిటీల ఏర్పాటుకు కాదు డిమాండ్ చేయాల్సింది, మావోయిస్టు కేసుల్లో జైళ్లలో మగ్గుతున్న ఖైదీలందరినీ వెంటనే, భేషరతుగా విడుదల చేయడం అవసరం.

అంతే కాదు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సామాజిక, మానవ హక్కుల కార్యకర్తలను, జర్నలిస్టులను, ప్రొఫెసర్లను, న్యాయవాదులను బస్తర్ నుండి వెళ్లగొట్టారు. వాళ్లపై అనేక పోలీసు స్టేషన్లలో బూటకపు కేసులు బనాయించారు. ఆ కేసులను ఉపసంహరించుకొని వాళ్లందరినీ స్వేచ్ఛగా పని చేసుకోనివ్వాలని డిమాండ్ చేయాల్సిన అవసరం వుంది.

పెసా, గ్రామసభ వంటి 5వ షెడ్యూల్ ద్వారా ఆదివాసులకు చెందాల్సిన రాజ్యాంగ హక్కులనూ, అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఆదివాసీ ప్రజలను నిర్వాసితులను చేసే గనుల తవ్వకాలూ, ప్రాజెక్టులూ, పరిశ్రమలూ, రైల్వే లైన్లూ, రోడ్లూ, అభయారణ్య ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. పేద ఆదివాసుల భూములను మింగి పోలీసు క్యాంపులు వెలుస్తున్నాయి. మునుపటి ప్రభుత్వం హయాంలో జరిగిన నరసంహారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, మహిళలపై సామూహిక అత్యాచారాలు, హత్యలపై న్యాయ విచారణకు సంబంధించి కనీసం ప్రకటనైనా వెలువడలేదు.

పైన పేర్కొన్న విషయాన్నింటిపైనా మౌనం వహించి కేవలం సైకిల్ యాత్ర చేయడం కానీ, మావోయిస్టులతో శాంతి/శాంతి చర్చలకు అపీల్ చేయడం కానీ నిజాయితీ రాహిత్యం మాత్రమే కాదు, ఆదివాసీ ప్రజలను మోసం చేయడమే. ఈ కవాతంతా 'సమాధాన్' కుట్రపూరిత దాడిలో భాగమే. దీనిని అర్థం చేసుకోండి, విఫలం చేయండి.

Vikalp

(వికల్ప్)

అధికార ప్రతినిధి,

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)